
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కర్ణాటక వార్తలు
సోమవారం 24 మార్చి 2025

సభాపతి పదవికి రాజీనామా చేస్తా

పరిషత్ సభ్యుల తీరు సరిగాలేదు: బసవరాజహొరట్టి



బెంగళూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం విధానపరిషత్ సభ్యులను సభలో నిభాయించడం సాధ్యం కావడం లేదని సభాపతి పదవికి రాజీనామా చేస్తున్నట్టు బసవరాజహొరట్టి తెలిపారు. ఆదివారం హుబ్బళ్ళిలోని నివాసంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రస్తుత రాజకీయ నాయకులను నియంత్రించడం సులువు కాదన్నారు. కలాపాలు జరుగుతున్న తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. సభాపతికి కనీసంగా కూడా అడగరని, సభలో ఉన్నఫళంగా నిరసనలు చేస్తారని, ప్లకార్డులు ప్రదర్శిస్తారన్నారు. రోజువారీ కలాపాలలో ఏవేవో జరిగిపోతున్నాయన్నారు. చర్చలు, నిరసనల సమాచారమే సభాపతిగా నాకు ఉండదన్నారు. సభను నడిపేశక్తి నాకు లేదనిపిస్తోందన్నారు. ఎగువ సభలో కొన్ని బిల్లులపై కీలకమైన చర్చలు జరగాల్సి ఉంటుందన్నారు. కానీ ప్రస్తుతం కొందరు సభ్యులు విలువ ఇవ్వడం లేదన్నారు. కనీస కారణాలు లేకుండానే నిరసన చేస్తారన్నారు. సభాపతి సూచనలకు విలువే లేకుండా పోతోందన్నారు. వాగ్వాదాలు, గొడవలు తారస్థాయికి చేరుతున్నాయన్నారు. శుక్రవారం కలాపాల వేళ ఏకంగా 17నిమిషాల పాటు మౌనంగా కూర్చున్నా అన్నారు. నాకు ఇటువంటి సందర్భంలో నిభాయించే అర్హత లేదనిపించిందన్నారు. సీనియర్లకు గౌరవం లేదన్నారు. 45ఏళ్లుగా పరిషత్‌లో ఉన్నానని, నా సీనియారిటీకి కనీస గౌరవం లేకుండా పోతోందన్నారు. ప్రస్తుత సభ్యులు నేనో సీనియర్ అనేది మర్చిపోయారన్నారు. సభాపతి స్థానం నుంచి ఆదేశిస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. నా మనసులోని మాటలు మీడియా ముందు చెప్పానని, అయితే ఆవేశంగా ఏ నిర్ణయం తీసుకుని, సన్నిహితులు, మిత్రులతో చర్చించాకే నిర్ణయం తీసుకుంటానన్నారు. సభాపతి బసవరాజహొరట్టి గతంలోనూ ఇదే తరహాలో రాజీనామాకు సిద్ధమైన విషయం తెలిసిందే. హొరట్టి బీజేపీ-జేడీఎస్‌ల మద్దతుతో ఎన్నికైనవారు. ప్రస్తుతం కాంగ్రెస్‌కు పరిషత్‌లో మెజారిటీ పెరగనుంది. ఖాళీగా ఉండే నాలుగు స్థానాలకు నామినేటెడ్ పద్ధతిన ఎంపిక చేస్తే కాంగ్రెస్‌కు మెజారిటీ పెరుగుతుంది. అప్పుడు హొరట్టిని సభాపతి స్థానం నుంచి తప్పించేందుకు కాంగ్రెస్ పార్టీ ఏమాత్రం వెనుకాడదు. సీఎం సిద్దరామయ్యతో బసవరాజహొరట్టికి సన్నిహిత సంబంధాలే ఉన్నా కాంగ్రెస్ నాయకులు ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించరు.

కాంగ్రెస్‌లోకి రండి..

జేడీఎస్ ఎమ్మెల్యే శారదకు మంత్రి పూర్యానాయక్ ఆహ్వానం

బెంగళూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): శివమొగ్గ గ్రామీణ నియోజకవర్గ జేడీఎస్ ఎమ్మెల్యే శారద పూర్యానాయక్‌ను బహిరంగసభలోనే కాంగ్రెస్‌లోకి చేరాలని విద్యాశాఖ మంత్రి మధుబంగారప్ప ఆహ్వానించారు. ఆదివారం శివమొగ్గలో పొరదాళుబారె డ్యాం అభివృద్ధి కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. రాష్ట్రంలో మా ప్రభుత్వం ఉందని ఇప్పుడే పార్టీలోచేరి నియోజకవర్గ అభివృద్ధికి ఎక్కువ సౌకర్యాలు పొందవచ్చునన్నారు. ఎండ ఉన్నప్పుడే గడ్డిని ఎండబెట్టుకోవాలనే ఓ సామెత ఉందని తెలిపారు. ఇంగ్లీషు సామెతలు నా తండ్రి బంగారప్ప చెప్పేవారనన్నారు. నేను పండితుడిని కానని, కన్నడ భాష కూడా పూర్తిగా తెలియదన్నారు. శారదక్క ఇంటికి వెళ్లి కార్యకర్తలు నిరసన చేసి అయినా కాంగ్రెస్‌లోకి చేరేలా ఒత్తిడి తీసుకురావాలన్నారు.

- రాష్ట్రంలో 5వేల చెరువుల భూములు కబ్జా
- ఆక్రమణలో 13వేల ఎకరాలు
- ప్రమాదంలో జలవనరులు
- తక్షణ చర్యలకు జిల్లా అధికారులకు ఆదేశం



సింగేనహల్లి చెరువు

కబ్జా కోరల్లో.. చెరువులు..!

బెంగళూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): దశాబ్దాల కిందటి నుంచే వర్షపు నీటిని ఎక్కడికక్కడ నిల్వ ఉంచుకుని వ్యవసాయం, తాగునీటి అవసరాలకు అనుకూలం చేసుకున్నారు. ఇలా చెరువులు ఉన్న ప్రతిచోటా కిందిభాగంలో పంట పొలాలు, పైభాగంలో పల్లెలు వెలిశాయి. ఒక చెరువుకు నీరు చేరే కాలువలు... చెరువు నిండిన తర్వాత ఆ నీరు మరో చెరువుకు సులభతరంగా వెళ్లేందుకు కాలువలు ఉండేవి. కానీ ఏళ్ల తరబడి సంతృప్తికరంగా వర్షాలు కురవక పోవడం, రాజకీయ నాయకుల పలుకుబడులు వంటి కారణాలతో రాష్ట్రంలో చెరువులు కబ్జాకు గురవుతున్నాయి.

● రాష్ట్రంలో 11,652 చెరువులకుగాను 37,282 ఎకరాల భూమి ఆక్రమణకు గురైంది. వీటిలో 6,575 చెరువులు పరిధిలో 23,983 ఎకరాల భూ ఆక్రమణలు తొలగించారు. ఇంకా 5077 చెరువులనుంచి 13,298 ఎకరాల భూమి అక్రమార్కుల కబంధ హస్తాల్లోనే ఉంది. వాటిని తొలగించాలని జిల్లా అధికారులకు ప్రభుత్వం ఆదేశించింది. జిల్లా స్థాయిలో అధికారుల కమిటీ ఏర్పాటు చేసుకుని ఆక్రమణలు తొలగించేందుకు చర్యలు చేపట్టాలని సూచించింది. రాష్ట్రంలో 10,754 చెరువులను సమీక్ష జరిపారు. 2023 ఏడాదికంటే 2024లో 70శాతం చెరువులు నిండాయి. సుమారు 25-30శాతం చెరువులకు నీరు చేరలేదు.

● కేంద్ర జలశక్తి మంత్రిత్వ కార్యాలయం 2017-18లో జలమూలాలపై సమీక్ష జరిపింది. దేశవ్యాప్తంగా 93వేల చెరువులు ఎండిపోగా అందులో కర్ణాటకలోనూ 3200 చెరువులు ఉన్నాయి. 2024 ఏడాదిలో సంతృప్తికరమైన వర్షాలతో ప్రాజెక్టులకు భారీగా నీరు చేరడంతో కాలువల ద్వారా 70శాతం చెరువులకు నీరు మళ్లించారు. సుమారు 25శాతం చెరువులకు


జక్కూరు చెరువు

నీరు చేరలేదు. చిన్ననీటి పారుదల శాఖ పరిధిలో 3,778 చెరువులు ఉన్నాయి. వీటిలో 1,07,705 మిలియన్ క్యూబిక్ ఫీట్‌ల గరిష్ఠ నీటి సామర్థ్యం ఉంది. ప్రస్తుత మార్చి 15వరకు అధికారులు తెలిపిన వివరాల ప్రకారం 194 చెరువులు ఎండిపోయాయి. 824 చెరువులలో 24శాతం, 963 చెరువులలో 50శాతం, 1,657 చెరువులలో 99శాతం గత ఏడాది భర్తీ అయ్యాయి. 146 చెరువులు సంపూర్ణంగా నిండినట్టు చిన్ననీటి పారుదల శాఖ అధికారులు ప్రకటించారు.

● సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డ్ నివేదిక ప్రకారం రాష్ట్రంలో 40,998 చెరువులకుగాను 7,63,832 ఎకరాల భూవిస్తీర్ణం ఉంది. 30,244 చెరువులకు సర్వే జరిపారు. వీటిలో కబ్జాకు గురైన 23,983 ఎకరాల చెరువు భూముల ఆక్రమణలు తొలగించారు. 5,077 చెరువులకు సంబంధించి 13,298 ఎకరాల భూమిలో ఆక్రమణలు తొలగించాల్సి ఉంది. రాష్ట్రంలో 10,754 చెరువుల సర్వే ఇంకా జరగాల్సి ఉంది. ప్రధానంగా ఆక్రమణలకు గురైన జిల్లాల్లో హాసన్, బెంగళూరు నగర, గ్రామీణ, తుమకూరు, శివమొగ్గ, మైసూరు జిల్లాల్లో అత్యధికంగా ఉన్నాయి. రాష్ట్రంలో 1,080 బావులకు సంబంధించి జలవనరులపై సమీక్ష జరిపారు. ఇందులో 804 బావులలో 74శాతం నీరు పెరిగింది. 276 చెరువులలో 25.4శాతం నీటిమట్టం తగ్గింది.

జిల్లా పేరు	చెరువులు	ఆక్రమణలు (ఎకరాల్లో..)	తొలగించాల్సింది
హాసన్	1533	599	934
మైసూరు	1209	819	391
కోలారు	809	699	108
చిక్కమగళూరు	761	269	492
రామనగర	735	32	703
బెంగళూరు	733	482	251
బెంగళూరు గ్రామీణ	643	642	01
చిక్కబళ్ళాపుర	455	318	137
తుమకూరు	608	131	477
మండ్య	448	240	208
చామరాజనగర	281	235	46
కొడగు	251	216	35

హనీట్రాప్‌పై ఆరా..!

- ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే, సీఎం భేటీ
- సీఎంను కలిసిన మంత్రి రాజణ్ణ కుమారుడు
- హనీట్రాప్‌పై ఫిర్యాదుకు మంత్రి కసరత్తు
- అదంతా బోగస్... కొట్టిపారేసిన డీసీఎం డీకే శివకుమార్

బెంగళూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కాంగ్రెస్‌లో సంచలనం రేకెత్తించిన హనీట్రాప్ అంశంపై అధిష్ఠానం ఆరా తీసింది. ఈమేరకు సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్‌లను సమగ్ర నివేదిక పంపాలని కోరినట్టు సమాచారం. శాసనసభలో మంత్రి రాజణ్ణ హనీట్రాప్‌కు గురయ్యానని ప్రకటించిన అంశంపై అధిష్ఠానం సీరియస్‌గా భావించినట్టు తెలుస్తోంది. కాగా ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే బెంగళూరులో ఉన్నారు. ఈమేరకు సీఎం సిద్దరామయ్య నివాసానికి ఆదివారం ఆయన వెళ్లారు. ఇరువురూ సుదీర్ఘ సమయంపాటు తాజా రాజకీయాలపై చర్చించారు. మల్లికార్జున ఖర్గే ఈ వివాదంపై అసంతృప్తి వ్యక్తం చేసినట్టు తెలుస్తోంది. ఇటువంటి పరిణామాలు ఎక్కడికి దారితీస్తాయని ప్రశ్నించినట్టు తెలుస్తోంది.

కాగా మంత్రి రాజణ్ణ కుమారుడు, ఎమ్మెల్సీ రాజేంద్ర సీఎం సిద్దరామయ్యను శనివారం కలిశారు. హనీట్రాప్‌కు సంబంధించి పలు అంశాలను వివరించినట్టు తెలుస్తోంది. తుమకూరులో రాజేంద్ర మీడియాతో మాట్లాడుతూ డీసీఎం డీకే శివకుమార్ అప్పుడు కుణిగల్ ఎమ్మెల్యే రంగనాథ్ ఫోన్ చేసి లింక్ కెనాల్ విషయంలో జోక్యం చేసుకోరాదని బెదరించేలా మాట్లాడారన్నారు. హేమావతి కాలువ నుంచి గుబ్బి, కుణిగల్, తురువెకెరెల మీదుగా తుమకూరు జిల్లాలోని ఇతర భాగాలకు నీరు రావాల్సి ఉంది. ఎగువన ఉండే కుణిగల్ వారే వదిలేందుకు అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ఇలా మాకు రాజకీయంగా పలు అడ్డంకులు ఉన్నాయని ఆరోపించారు.


సీఎం సిద్దరామయ్యతో మల్లికార్జున ఖర్గే చర్చలు

అదంతా బోగస్...: డీసీఎం డీకే శివకుమార్



హనీట్రాప్ విషయంలో అధిష్ఠానం ఆగ్రహం వ్యక్తం చేసిందనే అంశంపై డీసీఎం, కేపీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్ కొట్టిపారేశారు. అదంతా బోగస్ అని అబద్ధాలు ప్రచారం చేస్తున్నారన్నారు. ముఖ్యమంత్రిని ఎవరైనా కలవవచ్చునన్నారు. సీఎంను ఎవరెవరు కలిశారనేది నాకేం సంబంధం అన్నారు. హేమావతి కాలువ అంశమై ఎమ్మెల్యే రంగనాథ్ బెదరిస్తున్నారని రాజేంద్ర రాజణ్ణ ఆరోపణలను తోసిపుచ్చారు. 20ఏళ్లకుపైగా ఈ వివాదం ఉందని, ఎమ్మెల్యే వైకే రామయ్య ఉన్నప్పుడు కూడా ఇదే జరిగిందన్నారు. ఇటీవలే మంత్రి రాజణ్ణ కలిశాడని, ఏఏ అంశాలు మాట్లాడారనేది బహిరంగంగా చెప్పలేమన్నారు.


పుష్పయాగం చేస్తున్న అర్చకులు

నయనమనోహరం.. శ్రీహరి పుష్పయాగం

ముగిసిన ఖాద్రీశుడి బ్రహ్మోత్సవాలు

కదిరి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీసత్యసాయి జిల్లా కదిరి ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి పుష్పయాగోత్సవం నయనమనోహరం గా సాగింది. ఉదయం ఆలయ సంప్రోక్షణ, శుద్ధి, పరివార దేవతల అభిషే కం, గోపూజ, హోమాది కార్యక్రమాలు చేశారు. అనంతరం యాగశాల నుం చి స్వామి వారి కుంభం, కలశాన్ని గర్భాలయంలోకి తీసుకొచ్చారు. మధ్యా హ్నం స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి 12 రకాల పుష్పాలతో యాగోత్సవం నిర్వహించారు. స్వామివారు, భూదేవి, శ్రీదేవి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు: శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం రాత్రి నిర్వహించిన పుష్పయాగోత్సవంతో ముగిశాయి. 15 రోజుల పాటు అత్యంత వైభవంగా జరిగాయి. అంకురార్పణ నుంచి పుష్పయాగం వరకు ప్రతి ఉత్సవంలో శ్రీవారు భక్తులకు కనువిందు చేశారు.

రాష్ట్రాల హక్కులను కాలరాస్తున్న కేంద్రం
- సీపీఐ ఏపీ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ
8లో..

నగరంలో కూలిన చెట్లు

- ట్రాఫిక్‌కు అంతరాయం
- చెట్టు విరిగిపడి చిన్నారి మృతి


రక్షా (ఫైల్)

బెంగళూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): నగరంలో శనివారం రాత్రి ఈదురుగాలులతో కూడిన వర్షానికి పలు చోట్ల చెట్లు కూలాయి. జేసీ రోడ్డులో భారీ చెట్టు కూలిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. తాత్కాలికంగా వాహనాలను మళ్లించారు. ఆదివారం చెట్టును తొలగించి ట్రాఫిక్‌కు వీలు కల్పించారు. జీవనహళ్ళిలో కుమార్తెతో బైక్‌పై వెళ్తుండగా చెట్టు విరిగిపడింది. మూడేళ్ల చిన్నారి రక్షాకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే చిన్నారిని బౌరింగ్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. పులకేశినగర్ పరిధిలో ప్రమాదం చోటు చేసుకుంది. ఇక ఎయిర్‌పోర్ట్‌లో ఫ్లై ఓవర్‌తోపాటు రోడ్లపై భారీగా నీరు చేరడంతో వాహన సంచారానికి సమస్య నెలకొంది.


జేసీ రోడ్డులో కూలిన భారీ చెట్టు




ఎయిర్‌పోర్ట్ రోడ్డులో భారీగా చేరిన నీరు

సంప్రదాయ దుస్తులకు రామ్‌రాజ్ గుర్తింపు

కేజీ రోడ్ శాఖ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే సీపీ యోగేశ్వర్


బెంగళూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): భారతీయ సంప్రదాయంలో దుస్తులు ధరించే విధానం అనాదిగా వస్తోందని ఆ సంస్కృతిని ఇటీవల అన్ని ప్రాంతాల్లోనూ రామ్‌రాజ్ ద్వారా సాధ్యమవుతోందని ఎమ్మెల్యే సీపీ యోగేశ్వర్ అన్నారు. నగరంలోని కేజీ రోడ్‌లో ఆదివారం రామ్‌రాజ్‌శాఖను లాంఛనంగా ప్రారంభించారు. సంస్థ ఫౌండర్, చైర్మన్ కేఆర్ నాగరాజన్‌తోపాటు పలువురు పాల్గొన్నారు. సీపీ యోగేశ్వర్ మాట్లాడుతూ శుభకార్యాలు, దైవ దర్శనాలకు సంప్రదాయమైన పంచెకట్టు, జుబ్బా పైజామా వంటివి ఎక్కువ మంది వాడుతున్నారన్నారు. అటువంటి సంప్రదాయ దుస్తులకు రామ్‌రాజ్ గుర్తింపు తెచ్చిందన్నారు. రామ్‌రాజ్ ఫౌండర్ చైర్మన్ కేఆర్ నాగరాజన్ మాట్లాడుతూ సంప్రదాయ దుస్తులు మా ప్రత్యేకత అన్నా రు. తమిళనాడులోని తిర్పూర్, మధురై, చెన్నై, కోయంబత్తూరుతోపాటు బెంగళూరులలో ఫ్యాక్టరీలు ఉన్నాయన్నారు. కర్ణాటక వ్యాప్తంగా 67తో కలిపి దక్షిణాదిన 327 శాఖలు ఉన్నాయన్నారు. 50వేలమంది చేనేత కార్మికులు రామ్‌రాజ్ కోసం పనిచేస్తున్నారు. 4వేల పంచెకట్టులతోపాటు యువత, పిల్లలు అన్నివర్గాల వారికి అనువైన సంప్రదాయ దుస్తులు అందిస్తున్నామన్నారు. ఉగాది పండుగను పురస్కరించుకుని సంకల్పం బ్రాండ్‌ను పరిచయం చేస్తున్నామన్నారు. 7 రంగులలో జకార్డ్ వీవింగ్ షర్టులు, పంచెలు పరిచయం చేస్తున్నామన్నారు. వీటితోపాటు స్వయంవరం కలెక్షన్స్ బ్రాండ్‌లను అందుబాటులోకి తెచ్చామన్నారు. దక్షిణాదిలో ప్రతిచోటా రామ్‌రాజ్‌శాఖలు ఉన్నాయని, ఉత్తరభారత్‌లోనూ సంప్రదాయ దుస్తులు విస్తరింప చేయదలిచామన్నారు. విదేశాలలో ప్రస్తుతానికి మలేసియా, సింగపూర్, శ్రీలంకలలో శాఖలు ఉన్నాయని, అమెరికా, యూకేలోనూ త్వరలోనే తెరవదలిచామన్నారు. రామ్‌రాజ్‌డాట్‌కామ్ ద్వారా ఆన్‌లైన్‌లో అన్ని దేశాలకు ఎగుమతి చేస్తున్నామన్నారు. దేశంలోని ఏ ప్రాంతానికైనా మూడు రోజుల్లో డెలివరీ చేస్తామన్నారు.


రామ్‌రాజ్ శాఖను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సీపీ యోగేశ్వర్

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 6.47 (సోమవారం సాయంత్రం)

సెహరీ : 5.08 (మంగళవారం ఉదయం)



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1596.11	1,581.94
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	0	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	6,200	744
నీటి నిల్వ (టీఎంసీలు)	16.90	5.48

శ్రీశైలానికి పాదయాత్ర



కాలినడకన శ్రీశైలానికి వెళుతున్న భక్తులు

కంప్లి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలంలో ఉగాది ఉత్సవాలను పురస్కరించుకుని కర్ణాటక రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి భక్తులు పాదయాత్ర చేపట్టారు. జిల్లా పరిధిలోని కప్పగల్ నుంచి శ్రీశైలానికి కీలుగుర్రం పాదాలతో పాదయాత్ర చేపట్టారు. పాదయాత్ర చేపడుతున్న భక్తులకు రోడ్డు పొడవునా అన్నదానాలు చేపడుతూ స్థానికులు మొక్కులు సమర్పించుకుంటున్నారు. గత ఏడాది కన్నా ఈ ఏడు భక్తులు ఎక్కువగా పాదయాత్రతో వెళ్లారు.

ప్రభుత్వోద్యోగుల పని వేళల్లో మార్పు చేయాలి



డిప్యూటీ తహసీల్దార్ రాఘవేంద్రకు వినతిపత్రం ఇస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు

సిరుగుప్ప, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగుల విధుల నిర్వహణ సమయాన్ని మార్పు చేయాలని ఆ సంఘం కార్యదర్శి చంద్రకాంత్ కోరారు. విపరీతంగా ఎండలు వుండటంతో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ఆఫీసు వేళలు ఖరారు చేయాలని కోరారు. వేళల్లో మార్పులు జరుగకపోతే విధులు నిర్వర్తించేందుకు అనేక ఇబ్బందులు ఎదుర్కోవల్సి వస్తుందని అన్నారు. ఈ విషయంపై డిప్యూటీ తహసీల్దార్ రాఘవేంద్రకు వినతిపత్రం అందజేశారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని తహసీల్దార్ హామీ ఇచ్చారు.

శబరిమల అయ్యప్ప సేవా ట్రస్టు ప్రారంభం



అయ్యప్ప సేవా ట్రస్టు సభ్యులు

బళ్లారి సిటీ, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): నగరంలోని విద్యానగర్ అభయ ఆంజనేయస్వామి ఆలయంలో శబరిమల అయ్యప్ప సేవా ట్రస్టు (ఎస్ఏఎస్ఎస్) కర్ణాటక బళ్లారి జిల్లా యూనిట్ ఏర్పాటు చేశారు. ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని కల్యాణ సంస్థాన మఠం కమ్మరచేడు కల్యాణ మహాస్వామి నిర్వహించారు. యూనిట్ అధ్యక్షులుగా శ్రీరాంబాబు గురుస్వామి ఎన్నికయ్యారు. ఎస్ఏఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జయప్రకాశ్, ఉపాధ్యక్షుడు సంపత్‌కుమార్, అభయ ఆంజనేయస్వామి సేవా ట్రస్ట్ అధ్యక్షుడు వై.భాస్కర్, ఉపాధ్యక్షుడు బోయపాటి విష్ణువర్ధన్, సురేశ్ గురుస్వామి, మోహన్‌గురుస్వామి, భీమారెడ్డి గురుస్వామి, నాగేశ్ గురుస్వామి, రమేశ్‌రెడ్డి, త్రినాథ్, సునీల్, ఆనంద్‌చౌదరి, భక్తులు పాల్గొన్నారు.

రాష్ట్రాల హక్కులను కాలరాస్తున్న కేంద్రం

- ఏపీ సీఎం, డిప్యూటీ సీఎం మౌనంగా ఉండటం దేశద్రోహమే
- సీపీఐ ఏపీ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



మాట్లాడుతున్న సీపీఐ ఏపీ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

బళ్లారి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): భారత దేశంలో డీలిమిటేషన్ పేరుతో బీజేపీ నాయకులు రాష్ట్రాల హక్కులను కాలరాసే ప్రయత్నం చేస్తున్నారని సీపీఐ ఏపీ రాష్ట్ర కార్యాదర్శి రామకృష్ణ అన్నారు. తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలో డీలిమిటేషన్ విషయంలో 15 రాష్ట్రాల నుంచి పార్టీల ముఖ్యనాయకులు హాజరయ్యారన్నారు. కానీ ఏపీ నుంచి సీఎం చంద్రబాబు నాయుడు, మాజీ సీఎం జగన్ హాజరు కాలేదన్నారు. డీలిమిటేషన్ పేరుతో దేశానికి నష్టం కలుగుతున్నా వీరు మౌనంగా ఉండటం ఏమిటని ప్రశ్నించారు. ఇది ప్రజాద్రోహం, దేశద్రోహం అవుతుందని ఆయన మండిపడ్డారు. ఆదివారం భగత్‌సింగ్ వర్ధంతి సభ అనంతరం సీపీఐ రాష్ట్ర కార్యవర్గదర్శివర్గ సభ్యుడు జగదీష్, అనంతపురం జిల్లా కార్యదర్శి గోపాల్‌తో కలిసి రామకృష్ణ విలేకరుల సమావేశం నిర్వహించారు. డీలిమిటేషన్ పేరుతో మోదీ కొత్త రాజకీయానికి తెరలేపారన్నారు. దీని కారణంగా దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. జనాభా గణాకాల ప్రకారం ఉత్తరాదికి 129 సీట్లు పెరుగుతాయని, అదే దక్షిణాదిన 29 సీట్లు మాత్రమే పెరుగుతాయన్నారు. దక్షిణాదిలో జనాభానియంత్రణ పాటించారని, ఉత్తరాదిలో జనాభా నియంత్రణ పాటించకుండా చేశారు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీని వల్ల దేశ సమతుల్యత దెబ్బతింటుందని అన్నారు. ఏపీలో టీడీపీ, వైసీపీ నాయకులు ఒకరిపై ఒకరు రాజకీయ కత్తులు దూస్తున్నారు తప్ప డీలిమిటేషన్‌పై నోరు విప్పకపోవడం దారుణమన్నారు. టీడీపీ, వైసీపీ నాయకులు ఈ విషయంలో స్పష్టత ఇవ్వాలన్నారు. లేదంటే ప్రజలకు ద్రోహం చేసిన వారవుతారని అన్నారు. ఇక జనసేన పార్టీ నాయకుడు ఎన్నికల ముందు ప్రశ్నిస్తాను అని జనంలోకి వచ్చారని, ఎన్నికల ముగియగానే అధికారం దొరికిందికదా అని ప్రశ్నించడం మానేశారన్నారు. డీలిమిటేషన్ విషయంలో బీజేపీకి వ్యతిరేకంగా మాట్లాడకపోతే టీడీపీ, జనసేనలపై పోరాడేందుకు సిద్ధమన్నారు.

మాజీ సీఎం రేవణసిద్దయ్య సేవలు మరువలేనివి

మాజీ ఎమ్మెల్యే చంద్రశేఖర్‌స్వామి



మాజీ సీఎం రేవణ సిద్దయ్యకు నివాళులర్పిస్తున్న నాయకులు

కంప్లి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): రైతు నాయకుడు, మాజీ సీఎం రేవణసిద్దయ్య చేసిన సేవలు మరువలేనివని మాజీ ఎమ్మెల్యే చంద్రశేఖర్‌స్వామి అన్నారు. ఆయన 14వ పుణ్యస్మరణ సందర్భంగా ఆదివారం సమాధి వద్ద పూజలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ పదవీకాలంలో ఇళ్ల జప్తు, రైతుల వడ్డీ మాఫీ, రుణమాఫీ రైతులు పండించిన పంటలకు మద్దతు ధర, పండించిన పంటలకు నీటిపారుదల సమస్య వంటి అంశాలను లేవనెత్తడం ద్వారా శాసనసభలో రైతుల గొంతు వినిపించారన్నారు. ఆయన రైతు కార్యకర్త, రైతు కుమారుడు, రాష్ట్ర రైతుల గొంతు ఆయన జీవితాంతం తన సంరక్షణ, ప్రణాళిక, ఆలోచన కోసం అందరి మనస్సులో నిలిచిపోయిన రైతు నాయకుడు అన్నారు. సిరిగేరి మాజీ ఎమ్మెల్యే, రైతు కార్యకర్త, కర్ణాటక ఏకీకరణ అవార్డు గ్రహీత, ట్రాన్స్‌జెండర్ సీయం రేవణ సిద్దయ్య 14వ వర్ధంతిని ఆయన కుటుంబసభ్యులు ఆదివారం స్మారక ప్రాంగణంలో జరుపుకున్నారు. రైతు సంఘం అధ్యక్షుడు దరూరు పురుషోత్తమ గౌడ మాట్లాడుతూ రాష్ట్రం ఒక అరుదైన రాజకీయ నాయకుడని, నేటి శాసనసభ్యులు ఆయనను మార్గదర్శకంగా స్వీకరించాలన్నారు. ఆయన ఆదర్శమార్గం నేడు మనందరికీ స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో దరప్పనాయక, సీనియర్ న్యాయవాదులు సిద్దలింగయ్య, నాగరాజు స్వామి, బసరకోడు, సోమశేఖరప్ప, కేఎం మల్లయ్యస్వామి పాల్గొన్నారు.

యోగా జీవితంలో భాగం కావాలి

బళ్లారి సిటీ/హోస్పేట్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): రోజువారీ జీవితంలో యోగా ఒక భాగం కావాలని మున్సిపల్ కౌన్సిల్ అధ్యక్షుడు రేపేశ్ కుమార్ అన్నారు. ఆదివారం హొసపేటలో పతంజలి యోగా సమితి, మహాలక్ష్మి యోగా సెంటర్ నిర్వహించిన ప్రత్యేక యోగా ధ్యాన ప్రాణాయామ శిబిరంలో ఆయన మాట్లాడారు. ఈ రోజుల్లో నిరంతరం ఒత్తిడితో జీవిస్తున్నామని, యోగా మానసిక, శారీరక ప్రశాంతతను కలిగించడంలో సహాయపడుతుందని అన్నారు. వైస్ ప్రెసిడెంట్ రమేశ్‌గుప్తా మాట్లాడుతూ నగరంలోని అన్ని పార్కులలో యోగాకు అవసరమైన మౌలిక సదుపాయాలను మున్సిపల్ కౌన్సిల్ కల్పిస్తుందని అన్నారు. ఇంతకు ముందు చేప్పినట్లుగా పతంజలి యోగా సమితి హోస్పేటలో ఎక్కడ యోగా కేంద్రాన్ని ప్రారంభించాలనుకుంటే అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పిస్తామన్నారు.



యోగాలో పాల్గొన్న స్థానిక ప్రజలు

అమర వీరుల దినోత్సవం: దేశ స్వాతంత్ర్యం కోసం చిన్న వయసులోనే ప్రాణాలను త్యాగం చేసిన భగత్‌సింగ్, రాజ్‌గురు సుఖ్‌దేవ్ త్యాగాలను రాష్ట్ర యువజన ఇన్‌చార్జి కిరణ్‌కుమార్ గుర్తు చేసుకున్నారు. మున్సిపల్ కౌన్సిల్ సభ్యురాలు కనకమ్మ, స్థానిక నాయకులు, విరూపాక్షగౌడ, హనుమంతప్ప, డాక్టర్ హల్లికేరి, బాలచంద్రశర్మ, రాజేశ్, మంగళమ్మ, వీరేశ్, శ్రీధర పాల్గొన్నారు.

భగత్‌సింగ్ ఆశయాలను సాధిద్దాం

రాయచూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): భగత్‌సింగ్ ఆశయాలను సాధిద్దామని ఏఐడీవైఓ రాష్ట్రాధ్యక్షుడు శరణప్ప ఉద్బాళ్ పిలుపునిచ్చారు. భగత్‌సింగ్ కలలుగన్న సమసమాజ నిర్మాణంలో నేటి పాలకులు విఫలమయ్యారని ఆరోపించారు. భగత్‌సింగ్ వర్ధంతిని పురస్కరించుకుని నగరంలోని మామిడి చెరువు వద్ద ఆదివారం భగత్‌సింగ్‌తో పాటు అమరవీరులు సుఖ్‌దేవ్, రాజగురు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ ధరల పెరుగుదల, నిరుద్యోగం, పేదరికం, మహిళలపై దాడులు, అత్యాచారాలు నేటి సమాజంలో పరిపాటిగా మారాయన్నారు. వీటిని నిర్మూలించడంతో పాటు ప్రజలందరికి సమాన హక్కులు కల్పించినప్పుడే భగత్‌సింగ్ ఆశయాలు సాధించినవారమవుతామన్నారు. ఆ దిశగా విద్యార్థులు, యువకులు నిరంతర కృషి చేయాలన్నారు.



అమరవీరుల చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పిస్తున్న ఏఐడీవైఓ నేతలు

రోడ్ల ఆక్రమణలు వారంలోగా తొలగించాలి

- మహానగర పాలికె కమిషనర్ జుబిన్ మోహపాత్ర



తీన్ ఖందిల్ వద్ద రోడ్ల ఆక్రమణలను పరిశీలిస్తున్న ఎస్పీ, కమిషనర్

రాయచూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రధాన రోడ్లకు ఆనుకుని నిర్మించిన ఫుట్‌పాత్‌లను ఆక్రమించి చేస్తున్న వ్యాపారాలను వారం రోజుల్లోగా తొలగించాలని మహానగర పాలిక కమిషనర్ జుబిన్ మోహపాత్ర ఆదేశించారు. ఉగాది, రంజాన్ పండుగల అనంతరం ఆక్రమణల తొలగింపునకు కార్యచరణ సిద్ధం చేయాలన్నారు. జిల్లా ఎస్పీ పట్టమాదయ్యతో కలిసి ఆదివారం నగరంలోని ప్రధాన రహదారులను కమిషనర్ పరిశీలించారు. తీన్ ఖందిల్, మహావీర్ చౌక్ స్టేషన్ తదితర రోడ్లకు ఆనుకుని అనేక దుకాణాలు వెలిశాయని, వీటిని తొలగించి ఇబ్బందులు లేకుండా సహకరించాలని ప్రజలను కోరారు. వాహనాల సంఖ్య పెరగడంతో ప్రతి రోజు ఏదో ఒక చోట ప్రమాదాలు జరుగుతున్నాయని వాటిని నివారించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు.



అమరవీరులకు నివాళి అర్పిస్తున్న ఏఐడీఎస్ఓ నాయకులు

అమరవీరులకు నివాళి

బళ్లారి సిటీ,మార్చి 23(ఆంధ్రజ్యోతి): నగరంలోని విమ్స్‌మైదానం, మున్సిపల్ మైదానం, సోంతలింగన్న కాలనీ పార్కుతోపాటు వివిధ హాస్టళ్లు, గ్రామాల్లో భగత్‌సింగ్, సుఖదేవ్ రాజగురువుల 94వ అమరవీరుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఏఐడీఎస్ఓ రాష్ట్ర కోశాధికారి సుభాష్ మాట్లాడుతూ భగత్‌సింగ్ విప్లవం, స్వాతంత్ర్య ఆలోచనలను ఎంత బలంగా వ్యాప్తి చేశారంటే భగత్ సింగ్ ఆశయాలను నెరవేర్చేందుకు వేలాది మంది ప్రాణత్యాగాలకు వీధుల్లోకి వచ్చారన్నారు. విద్యార్థులు భగత్‌సింగ్ ఆలోచనలను స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఏఐడీఎస్ఓ జిల్లా కార్యదర్శి ఈరన్న మాట్లాడుతూ కర్ణాటక ప్రభుత్వం 6వేల ప్రభుత్వ పాఠశాలల మూసివేతకు వ్యతిరేకంగా లక్షా50వేల మంది సంతకాలు సేకరించి ప్రభుత్వ పాఠశాలలను కాపాడాలనే సంకల్పంతో భగత్‌సింగ్ అమరవీరుల దినోత్సవాన్ని జరుపుకున్నామన్నారు. జిల్లా ఉపాధ్యక్షులు ఎం.శాంతి, ఉమ, కార్యాలయ కార్యదర్శి నిహారిక, శివుడు పాల్గొన్నారు.

గౌతమ సూర్యసిద్ధాంత పంచాంగం విడుదల



పంచాంగాన్ని విడుదల చేస్తున్న స్వాములు

బళ్లారి సిటీ, మార్చి 23(ఆంధ్రజ్యోతి): నగరంలోని సత్యనారాయణపేట రాఘవేంద్రస్వామి మఠం సుశమీంద్ర మండపం ఆవరణలో ఆదివారం జ్యోతిష్యరత్న మధ్వవిజయ, రాఘవేంద్ర వైభవ అవార్డు గ్రహీత గురురాజ కులకర్ణి రచించిన పంచాంగాన్ని విద్యాసింధు మాధవ తీర్థలు విడుదల చేశారు. విద్యాసింధు మాధవ తీర్థలు భక్తులకు ఆశీర్వాదం చేశారు. భక్తులకు ప్రముఖులకు పంచాంగ పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో బి.కె. సుందరమూర్తి పాల్గొన్నారు.

యశస్విని సదుపాయాలు వినియోగించుకోండి



రైతులకు యశస్విని ఆరోగ్య బీమా పత్రాలు అందిస్తున్న చెన్నప్ప

కంప్లి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): తాలుకాలోని ప్రాథమిక కృషి పత్తిన సహకార సంఘం ప్రభుత్వ అమలు పరచిన యశస్విని ఆరోగ్య సదుపాయాలు సద్వినియోగం చేసుకోవాలని రైతు సంఘం తాలుకా అధ్యక్షుడు ఏసీ చెన్నప్ప సూచించారు. ఆదివారం కంప్లి తాలుకాలోని హంపదేవనహళ్లి గ్రామ ప్రాథమిక వ్యవసాయ క్రెడిట్ కోఆపరేటివ్ సొసైటీతో కర్ణాటక రాష్ట్ర రైతు గ్రీన్ ఆర్మీ కంప్లి తాలుకా అధ్యక్షుడు చెన్నప్ప, ఉపాధ్యక్షులు పంపాపతి, లింగప్ప, ప్రధాన కార్యదర్శి జడియప్ప, సుగ్గేనహళ్లి యూనిట్ అధ్యక్షుడు సుగ్గేనహళ్లి రామాంజనేయ, మావినహళ్లి గ్రామ యూనిట్ అధ్యక్షులు రమేష్ పేదలకు యశస్విని కార్డులు అందజేశారు. కార్యక్రమంలో దొడ్డ బసప్ప, కమల్ చిదానంద పాల్గొన్నారు.

పిల్లలకు తప్పనిసరిగా లసికలు వేయించాలి



పిల్లల ఆరోగ్య పరిస్థితిని పరిశీలిస్తున్న వైద్య బృందం

సిరుగుప్ప, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): పిల్లలకు తప్పనిసరిగా గడార వ్యాధికి సంబంధించి లసిక వేయించాలని తాలుకా వైద్యాధికారి దమ్మూరి బసవరాజు తెలిపారు. తాలుకాలోని రారావి, అళిగనూరు అంగన్‌వాడీ కేంద్రాలకు సందర్శించారు. అక్కడ పిల్లల ఆరోగ్య పరిస్థితిని పరిశీలించారు. వేసవిలో పిల్లలకు నడారా, జ్వరాలు సోకడం సర్వసాధారణం, వాటి నివారణకు నడారా లసిక వేయించాలని ఆయన సూచించారు. అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, తల్లిదండ్రులు పిల్లల ఆరోగ్యంపై జాగ్రత్తలు వహించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఆరోగ్య అధికారి శ్రీధర్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉల్లి ఎగుమతి సుంకం తగ్గింపుపై హర్షం



ఎగుమతికి సిద్ధంగా ఉన్న ఉల్లి

బళ్లారి సిటీ, మార్చి 23(ఆంధ్రజ్యోతి): ఉల్లిపాయలపై ఎగుమతి సుంకాన్ని 20శాతం తగ్గించాలని కేంద్రప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హర్షించతగ్గ విషయమని ఉల్లిపాయ పెంపకదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.సిద్ధేశ్ అన్నారు. ఆయన మాట్లాడుతూ దేశంలో ఉల్లిపాయల ఉత్పత్తిలో కర్ణాటక రెండో స్థానంలో ఉందన్నారు. ఎగుమతి సుంకాలను తగ్గించడం వల్ల రైతులకు కొంత ప్రయోజనం చేకూరుతుందని అన్నారు. మార్కెట్లో ఉల్లిపాయల ధరలు పడిపోయినప్పుడు, కేంద్ర ప్రభుత్వం తాలూకా స్థాయిలో కొనుగోలు కేంద్రాలను తెరిచి రూ.4వేల మద్దతు ధరకు రైతుల నుంచి నేరుగా కొనుగోలు చేస్తుందని తెలిపారు.

రైలు ఎక్కబోయి పడిపోయిన యువకుడు



గాయపడిన యువకుడు విజయకుమార్

రాయచూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): కదులుతున్న రైలు ఎక్కబోయిన యువకుడు పట్టుతప్పి జారిపోవడంతో రెండు కాళ్లు నుజ్జునుజ్జెయ్యాయి. ఈ ఘటన ఆదివారం స్థానిక రైల్వే స్టేషన్‌లో చోటు చేసుకుంది. బీఆర్‌బీ సర్కిల్‌లో నివసిస్తున్న విజయ్‌కుమార్ పని కోసం బెంగళూరుకు వెళుతుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. కదులుతున్న రైలును ఎక్కే ప్రయత్నం చేయడంతో పట్టుతప్పి పడిపోగా రెండు కాళ్లు నుజ్జునుజ్జు అయిట్లు అధికారులు తెలిపారు. వెంటనే 108 అంబులెన్స్‌లో బాధితుడిని రిమ్స్ ఆస్పత్రికి తరలించి చికిత్సలు అందిస్తున్నారు.

హోసూరు జోన్

ఘనంగా మునీశ్వరాలయ ఉత్సవం



భక్తులకు అన్నదానం చేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్

హోసూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): హోసూరు నగరంలోని మునీశ్వరనగర్ ప్రాంతంలో పురాతన మునీశ్వర దేవాలయం ఇరవయ్యో వార్షికోత్సవం ఘనంగా జరిగింది. మునేశ్వరనగర్, శివకుమార్‌నగర్, అన్నైనగర్, అక్షయ్ హోమ్స్, పూంచోలైనగర్, నాథన్‌నగర్ తదితర ప్రాంతాలకు చెందిన వేలాదిమంది భక్తులు పాల్గొన్నారు. నయ్యాండి మేళం పాటలు పాడి మునీశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు మేకలు, కోళ్ల బలి ఇవ్వగా సుమారు 10వేలమందికి బిర్యానీ సిద్ధం చేసి పంపిణీ చేశారు. ఎమ్మెల్యే వై ప్రకాశ్, ఆరోగ్య స్థాయి సమితి ఛైర్మన్ మాదేశ్వరన్ పాల్గొని బిర్యానీ పంపిణీ చేశారు. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

రోడ్డుకు మరమ్మతులు

హోసూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): హోసూరు నగరంలో వర్షానికి దెబ్బతిన్న బాగలూరు రోడ్డును ట్రాఫిక్ పోలీసులు చొరవ చూపి తాత్కాలిక మరమ్మతు పనులు నిర్వహించారు. శనివారం రాత్రి సుమారు 35 మిమీ వర్షం కురిసింది. సుమారు 2 కిలోమీటర్ల మేర రోడ్డు గుంతలమయం కావడంతో ట్రాఫిక్‌కు అంతరాయం నెలకొన్న తరుణంలో ట్రాఫిక్ పోలీసులు స్పందించారు. వాహనాల రాకపోకలకు వీలుగా అత్యవసరంగా సిమెంట్ మిశ్రమాన్ని తెప్పించి గుంతలు పూడ్చారు.



రోడ్డు పనులు ఇలా...

కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

హోసూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి పశ్చిమ జిల్లా కాంగ్రెస్ పార్టీ మునిసిపాలిటీ ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ విగ్రహం ఎదుట మసీదు వద్ద మత సామరస్యం కల్పించేలా ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ప్రత్యేక ఆహ్వానితులుగా ఎంపీ గోపినాథ్ విచ్చేశారు. మునిసిపల్ ఆర్గనైజర్ సాదిక్ ఖాన్ అధ్యక్షత వహించారు. సాదిక్‌పాషా, అక్బర్, డాక్టర్ కృష్ణమూర్తి, కౌన్సిలర్‌లు ఇంద్రాణి తదితరులు పాల్గొన్నారు. మత గురువులు పురుషోత్తమ శర్మ, చర్చ్ ఫాదర్ దివాకర్, జామియా మసీదు ముతవల్లి హసేన్‌లు పాల్గొని మతసామరస్యంపై ప్రసంగించారు. కాంగ్రెస్ కార్యకర్తలు చిన్నగుట్టప్ప, రఘు, నెర్లికర్ తదితరులు పాల్గొన్నారు.



ఇఫ్తార్ విందులో ఎంపీ గోపీనాథ్, నాయకులు, ముస్లింలు

నేత్ర పరీక్ష శిబిరం

హోసూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): టైటాన్ ఇంజనీరింగ్ అండ్ ఆటోమేషన్ లిమిటెడ్, హోసూరు ఎవరెస్ట్ అరిమా అసోసియేషన్, లయన్స్ క్లబ్ సహకారంతో ఉచిత నేత్ర పరీక్షా శిబిరం నిర్వహించారు. కోయంబత్తూరు అరవింద కంటి ఆసుపత్రి డాక్టర్‌లు పాల్గొని పరీక్షలు చేశారు. 130మందికిపైగా శిబిరం ప్రయోజనాలు పొందారు. శిబిరాన్ని ఆసుపత్రి పీఆర్ గోవిందరాజ్ ప్రారంభించారు. కృష్ణగిరి డిస్ట్రిక్ట్ విజన్ లాస్ ప్రివెన్షన్ సొసైటీ సభ్యులు, స్థానిక ప్రముఖులు శ్యాం ప్రకాశ్, కార్తీక్, భరత్‌రాజ్, రమణి, అరిమా సంఘానికి చెందిన కాశీ, నందకుమార్, రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.



రోగిని పరీక్షిస్తున్న వైద్యుడు

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

ముత్తుస్వామి దీక్షితులు (జయంతి)



కర్ణాటక సంగీతత్రయంలో ఒకరైన వాగ్గేయకారుడు ముత్తుస్వామి దీక్షితర్ (దీక్షితులు) 1775 మార్చి 24న తంజావూరులో జన్మించారు. వీణ విద్వాంసులుగాను రాణించారు. ఆయన కృతులు తెలుగుకంటే సంస్కృతంలో అధికంగా రాయబడ్డాయి. 'గురు గుహ' అనేది వీరి మకుటం. 500కు పైగా కీర్తనలు రాశారు. సంగీత, వ్యాకరణ, జ్యోతిష్య, వాస్తు, మాంత్రిక వైద్యవిద్యలలో ఆరితేరిన వ్యక్తి. కర్ణాటక సంగీతంలో ఏడు ప్రాథమిక తాళాల్లో కృతులు చేసిన ఏకైక స్వరకర్త. 72 మేళకర్త రాగాలలో కృతులు రచించారు. 'శివ పాహి ఓం శివే' మంత్రాన్ని ఉచ్చరిస్తున్న వేళ 1835 అక్టోబరు 21న తనువు చాలించారు.

టీఎం సౌందరరాజన్ (జయంతి)



టీఎంఎస్‌గా చిరపరిచితులైన 'పద్మశ్రీ' గ్రహీత టీఎం సౌందరరాజన్ 1922 మార్చి 24న మధురైలో జన్మించారు. తమిళ సినీ రంగంలో ప్రజాదరణ పొందిన నేపథ్య గాయకుడు. తెలుగు చిత్రసీమ మద్రాస్‌లో ఉన్న రోజుల్లో ఘంటసాలకు సమకాలీకులు. ఆరు దశాబ్దాలపాటు దక్షిణాదిన 11 భాషలలో ప్రముఖ నటుల పాటలు పాడారు. 5వేలకుపైగా సినిమాలకు 20వేలకుపైగా పాటలు పాడారు. అంతేకాక 3వేలకుపైగా భక్తిపాటలు ఆలపించారు. శాస్త్రీయ సంగీత కచేరీలు సైతం నిర్వహించారు. కలైమామణి, భారత్ కళాచార్, కళారత్నం తదితర పురస్కారాలు పొందారు. 91వ యేట 2013 మే 15న కన్నుమూశారు. 2016లో ఆయన స్మారక పోస్టల్ స్టాంప్ విడుదల చేశారు.

ఇమ్రాన్ హష్మి (పుట్టినరోజు)



హిందీ సినీ నటుడు సయ్యద్ ఇమ్రాన్ అన్వర్ హష్మి 1979 మార్చి 24న ముంబైలో జన్మించారు. అసిస్టెంట్ డైరెక్టర్‌గా సినీ రంగంలోకి ప్రవేశించి పలు విభిన్న పాత్రలలో నటించి 3 ఫిలింఫేర్ అవార్డులు అందుకున్నారు. 2016లో కుమారుడు కేన్సర్‌ను అధిగమించడంపై 'కిస్ ఆఫ్ లైఫ్' పేరిట ఆటోబయోగ్రఫీ పుస్తకాన్ని రాశాడు. వివిధ ఉత్పత్తులకు రాయబారిగా వ్యవహరిస్తున్నారు.

యదువీర్ (పుట్టినరోజు)



మైసూరు యువరాజు యదువీర్ కృష్ణదత్త చామరాజ ఒడయార్ 1992 మార్చి 24న జన్మించారు. అసలు పేరు యదువీర్ గోపాల్ రాజ్ అరసు. 23వ యేట మైసూరు యువరాజుగా పట్టాభిషిక్తులయ్యారు. మైసూరు సంస్థానానికి 27వ వారసుడిగా వ్యవహరిస్తున్నారు. పూర్వీకుల తరహాలో తన వంతుగా విద్య, పర్యావరణ అంశాలపై ప్రజలలో చైతన్యం కలిగిస్తున్నారు. ప్రస్తుతం మైసూరు ఎంపీగా కొనసాగుతున్నారు.

ఎమ్మెల్యేల బహిష్కరణను సమర్థించిన మంత్రి భోసరాజు

రాయచూరు, మార్చి 23(ఆంధ్రజ్యోతి): శాసనసభ నుంచి 18 మంది ఎమ్మెల్యేలను ఆరు నెలల పాటు సభ నుంచి బహిష్కరిస్తూ స్పీకర్ తీసుకున్న నిర్ణయాన్ని నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఎస్.భోసరాజు సమర్థించారు. సభ్యుల ప్రవర్తన తీరు మార్చుకునేందుకే సభాపతి ఈ నిర్ణయం తీసుకుని ఉంటారని అభిప్రాయపడ్డారు. ఆదివారం నగరంలో తన నివాసంలో మంత్రి విలేకరులతో మాట్లాడారు. శాసన సభ, శాసన మండలిలో సభ్యులు ప్రభుత్వం కాని స్పీకర్‌ల ఆధీనంలోనే పని చేయాల్సి ఉంటుందన్నారు. సభలకు తమదైన నియమాలు ఉంటాయని, వాటిని గౌరవించడం ప్రతి సభ్యుడి బాధ్యత అన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండానే స్పీకర్ ఇలాంటి కఠిన నిర్ణయం తీసుకుని ఉంటారని మంత్రి అన్నారు. స్పీకర్ తీసుకున్న నిర్ణయం వ్యక్తిగతమైంది కాదని సభాధ్యక్షుడి స్థానానికి ఉన్న గౌరవాన్ని కాపాడడమే ఈ నిర్ణయం వెనక ఉన్న ప్రధాన ఉద్దేశమన్నారు. సభాపతి స్థానాన్ని తప్పనిసరిగా గౌరవించాలని అగౌరవ పరిచే విధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు ఉంటాయన్నది నిబంధనలో స్పష్టంగా ఉందని మంత్రి పేర్కొన్నారు.

బెట్టింగ్ ఆడితే కఠిన చర్యలు

బత్తలపల్లి మార్చి 23(ఆంధ్రజ్యోతి): క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడినా, ప్రోత్సహించినా చట్టపరమైన చర్యలు తప్పవని సీఐ ప్రభాకర్ హెచ్చరించారు. ఆదివారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం 18వ ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లు జరుగుతున్నాయని, బెట్టింగులకు పాల్పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు.

ఇరువర్గాల ఘర్షణ

ధర్మవరంరూరల్, మార్చి23(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతుకుంటలో ఆదివారం ఇరువర్గాలు ఘర్షణ పడటంతో.. వారిపై కేసులు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. గ్రామంలో బృందావనం కాలనీ వద్ద సర్పంచ్ భర్త అంగజాల రాజు, జయరాంతో పాటు పలువురు ఎక్స్‌కవేటర్ సాయంతో రోడ్డుపక్కన ఆదివారం కంపచెట్లు తొలగించసాగారు. ఎందుకు కంపచెట్లు తొలగిస్తున్నారని కేశవయ్య అనే వ్యక్తి ప్రశ్నించడంతో పాటు దురుసుగా మాట్లాడారు. దీంతో ఇరువర్గాలు ఘర్షణపడ్డాయి. దీనిపై విచారణ చేసి అంగజాల రాజు, జయరాంతో పాటు మరో ఆరుగురిపై, మరో వర్గానికి చెందిన కేశవయ్యతో పాటు మరో ముగ్గురిపై కేసులు నమోదు చేశామన్నారు.

జిల్లా స్టేడియం అభివృద్ధికి కట్టుబడ్డాం

» జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్

చిక్కబళ్లాపుర, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రమైన చిక్కబళ్లాపురలోని సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య స్టేడియంను రూ.70కోట్లతో అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని జిల్లా ఇన్‌చార్జ్, ఉన్నత విద్యాశాఖ మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్ తెలిపారు. స్టేడియంను ఆదివారం పరిశీలించిన సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడారు. జిల్లా స్టేడియంను ఆధునాతన క్రీడా సౌకర్యాలతో అభివృద్ధి చేయదలిచామన్నారు. ఇందుకు వనరులను సమీకరిస్తున్నట్టు తెలిపారు. ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థల భాగస్వామ్యం లేదా కర్ణాటక క్రికెట్ అసోసియేషన్ సంస్థ సహకారంతో అభివృద్ధి చేయాలా అనే అంశంపై చర్చలు జరుగుతున్నాయన్నారు. స్టేడియంలో సింథటిక్ ట్రాక్ సహా పలు విధాలా అభివృద్ధి చేయదలిచామన్నారు. త్వరలోనే స్పోర్ట్స్ హాస్టల్ అందుబాటులోకి తేదలిచినట్టు తెలిపారు. ఈ సందర్భంగా యువజనులు, క్రీడలశాఖ కమిషనర్ చేటాన్, జిల్లా అధికారి పీఎన్ రవీంద్ర, అదనపు జిల్లా అధికారి డాక్టర్ ఎన్ భాస్కర్, డిప్యూటీ సూపరింటెండెంట్ అశ్విన్, తహసీల్దార్ అనిల్, జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.



స్టేడియాన్ని పరిశీలిస్తున్న మంత్రి సుధాకర్

మూడు తరగతి గదులు నిర్మిస్తాం



ప్రతిభా పురస్కారాల ప్రదానంలో ప్రముఖులు

ముళబాగిలు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): తాను విద్య నేర్చుకున్న పాఠశాలకోసం వచ్చే విద్యా సంవత్సరంలో 3 గదులను, వ్యక్తిగత శౌచాలయాలను నిర్మిస్తానని పూర్వ విద్యార్థి, ప్రగతి చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు జోగుళకాష్ఠి మునేశ్ తెలిపారు. తాలూకాలోని కన్నసంద్ర గ్రామంలోని ప్రభుత్వ కన్నడ ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రతిభావంత విద్యార్థుల అభినంద, సరస్వతి పూజా కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. 1943లో పాఠశాల నిర్మాణమైందని, చాలావరకు గదులు దుస్థితికి చేరాయన్నారు. ఈ నేపథ్యంలో తనవంతుగా మూడు కొత్త గదులను నిర్మిస్తానని హామీ ఇచ్చారు. ఏటా ఇక్కడి విద్యార్థులకు రాత సామగ్రి పంపిణీ చేసే కార్యక్రమాన్ని కొనసాగిస్తామన్నారు. ప్రధానోపాధ్యాయుడు గోవింద గౌడ మాట్లాడుతూ తమ పాఠశాలలో ప్రతిరోజూ యూనిఫాం ధరించి వస్తారని, దాతలు సహకరిస్తే యూనిఫాంతోపాటు ఒకరోజు రంగు రంగుల యూనిఫాం ధరించే అవకాశం ఉంటుందన్నారు. రానున్న రోజుల్లో కొత్త గదులకు మునేశ్ తీర్మానించడం సంతోషంగా ఉందన్నారు. ఇక్కడ చదివిన కస్తూరి, నాగార్జునలు పీయూసీ పరీక్షల్లో ఉత్తమమార్కులు సాధించడంతో వారికి ప్రతిభా పురస్కారంతో సత్కరిస్తున్నామని రానున్న రోజుల్లో ఎస్ఎస్ఎల్‌సీ, పీయూసీలలో ర్యాంకులు సాధించినవారిని తగిన రీతిలో సత్కరించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌డీఎంసీ అధ్యక్షుడు మునికృష్ణ, ఉపాధ్యాయులు నారాయణప్ప, శైలా, శాంతమ్మ, ఎస్ శోభ, గ్రామ పంచాయతీ మాజీ సభ్యులు గుంటప్ప, కేవీ నాగరాజ్, రిటైర్డు అధికారి నారాయణప్ప, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల సంఘం కార్యదర్శి సుబ్రమణ్య తదితరులు పాల్గొన్నారు.

పట్టుగూళ్ల మార్కెట్‌ను సందర్శించిన ఎండీ

శిడ్లఘట్ట, మార్చి 23(ఆంధ్రజ్యోతి): శిడ్లఘట్ట పట్టణంలోని ప్రభుత్వ పట్టుగూళ్ల మార్కెట్‌ను రాష్ట్ర సిల్క్ మార్కెటింగ్ బోర్డ్ మేనేజింగ్ డైరెక్టర్ డి రూపా మౌద్గిల్ సందర్శించారు. మార్కెట్ లావాదేవీలను, పట్టుగూళ్ల వేలం పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఇ-వేలం, ఇ-తూకం, ఇ-చెల్లింపుల గురించి అధికారులు వివరించారు. పట్టుగూళ్ల మార్కెట్‌లో గూళ్లకు అనుగుణంగా జాలరిలు కేటాయింపు, ప్రతి లాట్‌కు ఒక సంఖ్య ఇస్తున్నట్టు తెలిపారు. ఇ-వేలం ద్వారా రీలర్‌లు తమకు కావాల్సిన గూళ్లను బిడ్ చేస్తారన్నారు. ఎక్కువ బిడ్ నమోదు చేసేవారికి గూళ్లు లభిస్తాయన్నారు. ఒకవేళ బిడ్ ధర నచ్చకుంటే రద్దు చేసుకునే అవకాశం రైతుకు ఉంటుందని అధికారులు వివరించారు. ప్రక్రియ ముగిశాక ఎలక్ట్రానిక్ యంత్రాలలో పట్టుగూళ్లను తూకం వేస్తారని, ఇ-వేలం తర్వాత 24 గంటల్లోగా రైతుల బ్యాంకు ఖాతాకు నగదు జమ అవుతుందన్నారు. ఈ సందర్భంగా పట్టుశాఖ జాయింట్ డైరెక్టర్ మహదేవయ్య, ఎన్ ఉమేశ్, సహాయక డైరెక్టర్ కే తిమ్మరాజు, డెవలప్‌మెంట్ ఆఫీసర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఎండీ రూపాకు వివరిస్తున్న అధికారులు

ఆదర్శప్రాయుడు.. నాడప్రభు కెంపేగౌడ

చింతామణి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు నగర నిర్మాత నాడప్రభు కెంపేగౌడ రాష్ట్రానికే కాకుండా ప్రపంచానికి ఆదర్శప్రాయులని ఆదిచుంచనగిరి మఠం చిక్కబళ్లాపురశాఖ అధ్యక్షులు మంగళానందనాథస్వామిజీ అభిప్రాయపడ్డారు. పట్టణ శివారులోని బూరగమాలకహళ్ళి సీతారామకల్యాణమండపంలో ఏర్పాటైన కార్యక్రమంలో 'కర్ణాటక కెంపేగౌడ ఒక్కలిగ సంఘాన్ని' లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వామిజీ మాట్లాడుతూ వేరే దేశాలకు వెళ్లినప్పుడు కర్ణాటక అంటే ఎవరికీ పెద్దగా తెలియదని అయితే బెంగళూరు అంటే ఇట్టే గుర్తుపడతారన్నారు. అలా బెంగళూరు నగరానికి 500 ఏళ్లక్రితమే కెంపేగౌడ రూపొందించారన్నారు. కెంపేగౌడ పేరిట మరో సంఘాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. సంఘం ప్రముఖులు సీకల్ రామచంద్రగౌడ, న్యాయవాది శంకరప్ప, కోలారుకు చెందిన డాక్టర్ రమేశ్ తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులను, సంఘం పదాధికారులను ఆత్మీయంగా సత్కరించారు.



సంఘం ప్రముఖులకు సన్మానం

వైద్యసేవలు సరళీకృతం కావాలి



ప్రారంభిస్తున్న నటి అదితి ప్రభుదేవా తదితరులు

బెంగళూరు, మార్చి 23(ఆంధ్రజ్యోతి): సమాజంలో జనాభాకు అనుగుణంగా వైద్యసేవలు సరళీకృతం కావాలని ఎంపీలు పీసీ మోహన్, తేజస్వీసూర్యలు అభిప్రాయపడ్డారు. వైష్ణవి హాస్పిటల్స్ ఆధ్వర్యంలో మల్టిస్పెషాలిటీ కేంద్రాన్ని హెచ్ఎస్ఆర్ లే అవుట్‌లో ఆదివారం లాంఛనంగా ప్రారంభించారు. ముఖ్య అతిథిగా ప్రముఖ నటి అదితి ప్రభుదేవా పాల్గొన్నారు. ఎమ్మెల్యే సతీశ్‌రెడ్డి, రాజ్యసభ మాజీ సభ్యుడు కుపేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైష్ణవి హాస్పిటల్స్ ఎండీ హరిప్రసాద్‌శెట్టి మాట్లాడుతూ జనరల్ మెడిసిన్, గైనకాలజీ, డెర్మటాలజీతోపాటు అన్ని విభాగాలలోనూ అత్యాధునిక వైద్యసేవలు అందుబాటులోకి తెచ్చామన్నారు. నాణ్యమైన ఆరోగ్యసేవల విషయంలో రాజీ ఉండదన్నారు. యూరాలజీ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ ప్రతీక్, జనరల్ మెడిసిన్ కన్సల్టెంట్ డాక్టర్ రాకేశ్, డెర్మటాలజీ క్లినికల్ డైరెక్టర్ డాక్టర్ శ్వేతా వేణుగోపాల్, డాక్టర్ స్మితా తదితరులు పాల్గొన్నారు.

సమాజాభివృద్ధిలో మహిళలది కీలకపాత్ర



వివిధ రంగాల ప్రముఖులకు సన్మానం

శిడ్లఘట్ట, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): సమాజం ఉత్తమ మార్గంలో సాగేందుకు, అభివృద్ధిలో మహిళలపాత్ర కీలకమని, కావున స్త్రీగా పుట్టినందుకు గర్వపడాలని జిల్లా సివిల్ న్యాయాధికారి, జిల్లా న్యాయసేవా ప్రాధికార సహ కార్యదర్శి శిల్పా అభిప్రాయపడ్డారు. శిడ్లఘట్ట - జంగమకోటె మార్గంలోని హిత్తలహళ్ళి గేట్ సమీపాన ఇండియన్ ప్యాలెస్‌లో ఫౌండేషన్ ఫర్ ఎకలాజికల్ సెక్యూరిటీ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటైన అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ప్రారంభించి మాట్లాడారు. మహిళలు, పురుషులమధ్య వ్యత్యాసాలు ఉన్నాయని అయితే రాజ్యాంగం ప్రకారం ఇద్దరికీ సమాన అవకాశాలు కల్పించారని సద్వినియోగం చేసుకుని ఉన్నత హోదాలలో రాణించాలన్నారు. అయితే కొంతమంది చట్టాలను దుర్వినియోగం చేసుకోవడం ద్వారా అందరికీ అపకీర్తి వస్తోందని విచారం వ్యక్తం చేశారు. ఇటువంటికి అవకాశం ఇవ్వకుండా మీకంటూ ప్రత్యేకతను సాధించి మీ కుటుంబాన్ని ఉద్ధరించుకోవాలన్నారు. ఇతరులకు ఆదర్శంగా నిలవాలన్నారు. ఇటీవలికాలంలో చాలామంది తల్లిదండ్రులు తమ దైనందిన కార్యకలాపాలతో ఇళ్లలోని ఆడపిల్లల గురించి పట్టించుకోలేని పరిస్థితి నెలకొందన్నారు. పిల్లలపై విశ్వాసం ఉండాలని అయితే అతి ఉండరాదన్నారు. మొబైల్ ఇష్టం వచ్చినట్టు వాడకం, చెడు స్నేహితుల సావాసంపై నియంత్రణ చేయాలన్నారు. చెడు వ్యసనాలకు లోనుకాకుండా మార్గదర్శకం చేయాలన్నారు. చదివే వయస్సులో ఆరోగ్యంపై దృష్టి సారించేలా వ్యవహరించాలన్నారు. చిన్న వయస్సులో వివాహం చేయరాదని, పిల్లలకు వాహనాల డ్రైవింగ్‌కు అవకాశం ఇవ్వరాదన్నారు. కాగా మహిళల సాధనను గుర్తించేలా అంగన్‌వాడీ కార్యకర్తలు రంగవల్లులు వేయగా ఆకట్టుకుంది. వివిధ రంగాల ప్రముఖులను సత్కరించారు. పంచాయతీ రీసోర్స్ సెంటర్ మమతా, సరోజమ్మ బృందం నత్య ప్రదర్శన ఆకట్టుకుంది. జిల్లా పంచాయతీ ఉపకార్యదర్శి అతీక్‌పాషా, జిల్లా మక్కళ సంరక్షణాధికారి నౌతాజ్, సహాయక శిశు అభివృద్ధి అధికారి లక్ష్మీదేవమ్మ, పశు వైద్యాధికారి శ్రీనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆరోగ్యంపట్ల జాగ్రత్త పాటించాలి

బెంగళూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆరోగ్యంపట్ల జాగ్రత్తలు పాటించాలని కిండర్ ఆసుపత్రి సీఈఓ శ్రీవల్లి పిలుపునిచ్చారు. ఆదివారం వైట్‌ఫీల్డ్‌లో సైకిల్-ఏ-థాన్ పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. కిండర్ మహిళా ఆసుపత్రి, ఫెర్టిలిటీ సెంటర్‌ల సంయుక్త ఆధ్వర్యంలో డెక్లథాన్ సహకారంతో సైకిల్-ఏ-థాన్ నిర్వహించారు. అన్నివర్గాల ప్రజలు పోటీల్లో పాల్గొన్నారు. పది కిలోమీటర్ల మేర సైక్లింగ్ పోటీలు జరిగాయి. మహిళలు శారీరకంగా దృఢంగానే ఉంటేనే సంతానసాఫల్యం సాధ్యమన్నారు. జీవనశైలిలో మార్పులు తెచ్చుకుని ఆరోగ్యంపట్ల అవగాహన పొందాలన్నారు. సైక్లిస్టులు నినాదాలతో కదిలారు.



వైట్‌ఫీల్డ్‌లో సైకిల్ పోటీ



సింధనూరులో యువకుల ఆటో ర్యాలీ

భగత్ సింగ్‌కు ఘన నివాళి

రాయచూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమర యోధుడు, విప్లవ యోధుడు భగత్ సింగ్ వర్ధంతిని జిల్లా అంతటా ఆదివారం నిర్వహించారు. సింధనూరు నగరంలో సర్దార్ భగత్‌సింగ్ వర్ధంతిని పురస్కరించుకుని నిర్వహించిన లాల్ సలామ్ ఆటోల ర్యాలీ అందరిని ఆకట్టుకుంది. ఆటో డ్రైవర్ల యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీలో ఆటోలకు ఎర్రజెండాలు కట్టి సర్దార్ భగత్ సింగ్ చిత్రపటంతో సింధనూరు నగరంలోని ప్రధాన రహదారుల్లో నిర్వహించిన ఊరేగింపు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా మాట్లాడిన ఆటో యూనియనర్ అధ్యక్షుడు దేశమాతా సేవలో ప్రాణాలను పణంగా పెట్టిన సర్దార్ భగత్ సింగ్, రాజ గురు, సుఖ్‌దేవ్‌లు నేటి తరం పోరాటాలకు ఆదర్శప్రాయమన్నారు. దేశభక్తి, త్యాగం వారి ఆశయ సాధన కోసం ప్రతియొక్కరు కట్టుబడి ఉండాలన్నారు.

పార్టీ బలోపేతానికి సమష్టి కృషి



పార్టీ మోర్చా పదాధికారుల సమావేశం ప్రారంభోత్సవంలో మాజీ మంత్రి లింబావళి, ఎమ్మెల్యే మంజుల

మహదేవపుర, మార్చి 23(ఆంధ్రజ్యోతి): సమాజంలోని పనులను సామాజికసేవగా భావించాలని అలాగే పార్టీని బలోపేతం చేసేందుకు కార్యకర్తలంతా సమిష్టి కృషి చేయాలని మాజీ మంత్రి అరవింద లింబావళి అభిప్రాయపడ్డారు. ఎమ్మెల్యే మంజుళా లింబావళి నేతృత్వంలో నియోజకవర్గంలోని కాటంనల్లూరులోని మంజునాథస్వామి కల్యాణ మండపంలో బీజేపీ రూరల్ పదాధికారులు, వివిధ మోర్చాల పదాధికారుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాజీ మంత్రి లింబావళి మాట్లాడుతూ పార్టీలోని స్థానాలు కేవలం హోదాలు కాదని వాటిని బాధ్యతాయుతంగా నిభాయించాలని పిలుపునిచ్చారు. బూత్‌స్థాయి, బీఎల్ఏ2, శక్తికేంద్రం, వార్డు, హోబళి పదాధికారులు పాల్గొన్నారు. స్లం మోర్చా పదాధికారులు కూడా భాగస్వామ్యులయ్యారు. పార్టీ బలోపేతం కావాలంటే అన్నివర్గాల ప్రజలతో మమేకం అయ్యేలా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ఎస్సీ మోర్చా, ఓబీసీ మోర్చా, యువ మోర్చా, మహిళా మోర్చా, ఆర్‌డబ్ల్యుఏ, స్లం మోర్చా ఇలా వివిధ స్థాయిలలో కార్యకర్తలు, పదాధికారులు పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. మహదేవపుర గ్రామీణ ప్రాంతంలోనూ పార్టీ బలోపేతం కావాలన్నారు. సమావేశంలో రూరల్ హోబళి అధ్యక్షుడు హెచ్ఎస్ పిళ్ళప్ప, తాజా మాజీ అధ్యక్షుడు బీఎన్ నటరాజ్, మాజీ అధ్యక్షుడు పాపణ్ణ తదితరులు పాల్గొన్నారు.

సాహిత్యాభిలాష పెరగాలి



తుర్లపాటి రాజేశ్వరికి సత్కారం

బెంగళూరు, మార్చి 23(ఆంధ్రజ్యోతి): ప్రజలలో సాహిత్యాభిలాష పెరగాలని కేంద్ర సాహిత్య అకాడమీ గ్రహీత తుర్లపాటి రాజేశ్వరి అభిప్రాయపడ్డారు. నగరానికి విచ్చేసిన సందర్భంగా తెలుగు విజ్ఞాన సమితి భవన్‌లో రాష్ట్రేతర తెలుగు సమాఖ్య ఆధ్వర్యంలో ఆత్మీయంగా సత్కరించారు. ఈ సందర్భంగా సమాఖ్య పదాధికారులతోపాటు సమితికి చెందిన ఆదికేశవులు నాయుడు, లక్ష్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఒకరు... విద్యుదాఘాతంతో మరొకరు మృతి

» 24 గంటల్లో ఇద్దరు మృతి



రైతు మునివెంకటప్ప మృతదేహం

దొమ్మసంద్ర, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ఒక వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందిన విషాదంలో ఉండగా అంత్యక్రియలకోసం వచ్చిన వ్యక్తి విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందాడు. ఇలా 24 గంటలలో ఇద్దరు మృత్యువాత చెందారు. వివరాలిలా. కేఎస్ఆర్టీసీ డ్రైవర్ నాగరాజు (70) అనారోగ్యంతో చందాపురలో మృతి చెందాడు. అతడి మృతదేహాన్ని నాగనాయకనహళ్ళికి తీసుకొచ్చారు. విషాదంలో రాత్రంతా అతడి కుటుంబీకులు భజన చేశారు. కాగా ఆదివారం తెల్లవారుజామున చెత్త పడేసేందుకు వెళ్లిన రైతు మునివెంకటప్ప (65) విద్యుదాఘాతంతో మృతి చెందాడు. తోటలో పనిచేసి జీవనం సాగించే మునివెంకటప్ప ఇటీవల ఒక ఆవును కొనుగోలు చేశాడు. ఇతను నాగరాజుకు బంధువు కావడంతో అంత్యక్రియల కోసం వచ్చాడు. శనివారం రాత్రి కురిసిన వర్షం ప్రభావంతో చెత్త పడేసేందుకు వెళ్లిన వేళ విద్యుత్ తీగను తాకి షాక్‌కు గురై మృతి చెందాడు. తెల్లారాక బంధువులు గుర్తించారు. విషయాన్ని పోలీసులకు సమాచారం అందించారు.

రియల్టర్ దారుణ హత్య

» వ్యాపారంలో విభేదాలే కారణమా..?

బెంగళూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు నగర శివారు సోలదేవనహళ్ళిలోని బీఈఎస్ లే అవుట్‌లో రియల్టర్ లోక్‌నాథ్‌సింగ్ (37)ను దారుణంగా హత్య చేశారు. లోక్‌నాథ్‌సింగ్‌కు ఇటీవలే పెళ్లి కుదిరింది. మరి కొన్ని రోజుల్లో వివాహం జరగాల్సి ఉండేది. ఇతను మాగడి ఎమ్మెల్యే బాలకృష్ణకు అత్యంత ఆప్తుడిగా గుర్తింపు కల్గినవారు. శనివారం సాయంత్రం నలుగురుదైగురు మిత్రులతో కలసి నిర్మాణ దశలో ఉన్న భవనం వద్దకు కారులో వచ్చారు. కారులోనే మద్యం తాగుతుండగా వాగ్వాదం చోటు చేసుకుంది. అంతలోనే గొంతుతోపాటు పలుచోట్ల చాకులతో పొడిచి దాడి చేయడంతో రక్తస్రావమైంది. కారునుంచి దిగి సుమారు 150 మీటర్లు పరుగెత్తి ఓ ఆటోలో కూర్చున్నాడు. అక్కడికక్కడే కుప్పకూలి లోక్‌నాథ్ మృతి చెందాడు. హత్య జరిగిన తర్వాత లోక్‌నాథ్ గన్‌మెన్ పరారీ కావడం పలు అనుమానాలకు దారి తీసింది. కొంతసేపటి తర్వాత గన్‌మెన్ పోలీసులకు లొంగిపోయాడు. 2018 నుంచి 2020 మధ్య లోక్‌నాథ్‌పై పలు పోలీస్‌స్టేషన్లలో మోసం చేశారనే కేసులు ఉన్నాయి. సోలదేవనహళ్ళి పోలీసులు సంఘటనా స్థలాన్ని చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. లోక్‌నాథ్‌సింగ్ మాగడి తాలూకా పుదూరు గ్రామానికి చెందిన వ్యక్తి.